# మంచి — చెడు

శ్రీ ధాయిపులె బాలకృష్ణరావు

ప్రియాతి ప్రియమైన రాణి,

మధురాతి మధురమైన క్షణాలకోసం వేచుకొని వున్నాను. హృదయ గుహ్వరంలో ఆశాజ్యోతులు వెలిగాయి. కూనిరాగాలతో నాలో యెవరో ప్రణయ గీతాలు పాడుతున్నారు. ఆ గీతాలాపనలో మేళవించి పోయాను. అప్రయత్నంగ నేనూ శ్రుతి కలిపాను.

అచంచలమైన చిరకాల తపస్సు ఫలించింది. అవ్యాజమైన ప్రేమానురాగాలతో ప్రణయ కుసుమాల్ని ఒకరికొకరం అందజేసుకున్నాం. ప్రేమాతిశయాలతో నిర్దుష్టమైన ప్రేమతీగెలు పెన వేసుకబోతున్నాయి. నామనోరథము నెఱవేరింది. నా జీవిత గమనానికిది పునాది.

జీవితమధువును గ్రోలడానికి యింక నాకెంతో కాలం లేదు. హృదయాంగణ పరిధుల్లో విహరిస్తూ నాలో నాకోసం నిరీక్షిస్తున్నందున, తనువంతా మన్మథుని శాంత బాణములకు గురిఅయింది. నన్నెవరో స్పర్శించినట్లుంది. నిజాన్ని దాచిపెట్టక వ్రాస్తుంటే నాకెందుకో ఒళ్ళంతా పులకరించినట్లుంది.

రవి అంతగా నీకు తెలియదనుకుంటాను. ఛా! ఎంత మతిమరపు. ఒకసారి నీకు పరిచయం గూడ చేశాననుకుంటాను. ఒకవేళ అతను నీకు జ్ఞాపకంలేకపోతే ఆయనెలావుంటాడో, పరిచయంచేసిన రోజెలా వున్నాడో జ్ఞప్తికి తెచ్చేందుకు వ్రాస్తున్నాను. చిలిపిగా వ్రాస్తున్నానని నవ్వుతున్నావుకదూ! నేను వ్రాసే మాటలన్నీ చిలిపిగా వుంటాయిలే! ...?... ఆయన్ను వర్ణించాలంటే నాకెంతో సిగ్గుగావుంది. నా ము[illegible]రున్నట్లు భ్రమిస్తున్నా. ఎందుకో మరి! ఆయన్నుగూర్చి చెప్పాలన్నా గాని, చూడాలన్నా గాని గిలిగింతలు పెట్టినట్లవుతుంది. ఏదోమరి కళ్ళుమూసుకొని వ్రాసేస్తున్నాను. మనిషి గోధమవర్ణం. నూనూగు మీసాలు, గుండ్రముగా వుండే వదనము. అందంగా వెనక్కి దువ్విన క్రాపు 'మీద నూత్నటగవుంటాడు. నువ్వు మా వూరికి వచ్చినపుడు, మనమిద్దరము కలసి సినిమాకు వెళుతుంటే మిత్రాలోడుతో లాల్చీ పంచ కట్టిన వ్యక్తిని పరిచయం చేసానే ఆవ్యక్తే పైన వర్ణించిన, కాబోతున్న ... ...

రాణి! రవిని నేను ప్రేమించాను. అతనికంటే అతని మంచి స్వభావాన్ని యింకా యెక్కువగ ప్రేమించాను. హృదయ పూర్వకముగ ప్రేమించాను. రవినన్నర్థం చేసికున్నాడు. అందుకే అనాడు ... అబ్బ ఎందుకో సిగ్గు ... తనతో భాగస్తురాలుగ కావలని కోరాడు. అందుకు నా మనస్సు నిరాకరించలేదు.

అతనిలో నేను విశ్వాసము కోల్పోకుండవుండటానికి కారణం లేకపోలేదు. అది అతని శుద్ధమైన స్వభావమే. నిష్కళంకమైన ప్రేమ తత్వాన్ని తెలియని వాళ్లు ఆచరించినట్లు అనుకరించకుండవుండడము.

ఆ రోజు చీకటి దట్టముగ అలుముకొనివుంది, మనకాలేజిలో సమీరసమితి బృందమువాళ్లు వేసిన నాటకాన్ని చూసి తిరిగి వస్తున్నాను - స్నేహితురాళ్ళతో కలిసి. మా గుంపులో నువ్వుగూడవున్నావనుకుంటాను. అవునవును_నువ్వూవున్నావు. నీవేదో ఛలోక్తిగ ఒకమాట చెబితే అందరూ ఫక్కున నవ్వాము. జ్ఞాపకముందా? డిస్పర్సు రోడ్డు వద్ద అందరు విడిపోయి యెవరింటికి వాళ్లుబయలుదేరాము. అమావాస్యరాత్రేమో! తమస్సు దట్టముగ వుంది. మాయింటిని నేను చేరాలంటే నేనింక ఒక ఫర్లాంగు దూరము నడువాల్సి వుంది. వీధిగుండా పోవాలి. ఆ వీధి చాల మెలికలు తిరిగి వుంది. చిన్న చిన్న సందులున్నాయ్. ఆ సందులలో చూశామంటే చాల భయమేస్తుంది. అవి రౌడీలకు దొంగలకు మంచి అవకాశాన్ని కల్పించే ప్రదేశాలని మా నాన్న చెప్పంగ విన్నాను. అందుకే భయాందోళనలతో గుండెను గుప్పెట్లో పెట్టుకొని దడిదడిగ అడుగులు వేస్తూ పోతున్నాను. ఎందుకో ఒకసారి తిరిగి

చూడాలనిపించింది. రౌడీలైన వెంటాడుతున్నారేమోనని బెదురుగా వెనుతిరిగి చూశాను. నేను స్తంభించిపోయాను. నా భయమింక వర్ణనాతీతము. నావేపు ఏదో ఆకారము వస్తున్నదని గ్రహించాను. కాళ్ళు, చేతులు వణకి పోయాయి. త్వరత్వరగ అడుగులు వేస్తూపోయాను. సందుమలుపులో మునిసిపాలిటి గుడ్డిదీపము వెలుగుతోంది. ఆసందు తిరుగుతూనే నాలుగవ యిల్లు మాది. బ్రతికేనురా దేవుడా అనుకున్నాను. దీపపు స్తంభము దగ్గరనిలబడి తిరిగి చూశాను. రాను, రాను ఆ ఆకార స్వరూపము ఎవరో గ్రహించాను. అవ్యక్తి మామూలుగనే నడుస్తున్నాడు. సమీపిస్తూనే నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. రవి నన్ను అనుసరిస్తున్నాడు.

నాకెందుకో అతనిపై మొదట్లో అనుమానం కలిగింది. అతను నమస్కారము చేయకముందే నేను నమస్కరించాను. "గుడ్ నైట్ ప్రమీల!" అతను ప్రతి నమస్కారము చేస్తూ చెప్పాడు. నేను మూగబోయి నిలిచాను. అతను అందుకున్నాడు.

"ప్రమీలా! రోజులు చాల సున్నితంగవున్నాయ్ చూసి మసలుకోవాలి. అమ్మాయిలు రాత్రిపూట ఒంటరిగ తిరగడం మంచిదికాదు. అందుకే మీ వెంటరావడం. మీరు మరోవిధముగ అనుకోకుంటే కృతజ్ఞుణ్ని ... వస్తాను." తిరిగి వెళ్ళబోయాడు. అతను నిర్భయముగ, నిస్సంశయముగ చెప్పాడు. దాన్ని జ్ఞానోపదేశముగ తీసుకున్నాను.

"క్షమించండి ఇకమీదట ఒంటరిగ తిరగను" అన్నాను, "ఇంక మీయిల్లు దగ్గరే అనుకుంటాను. సెలవు", వెళ్ళిపోయాడు. అతన్ని మనస్సులో అభినందించుకున్నాను.

ఇలాగ నన్నెన్నోసార్లు జ్ఞాన బోధ చేశాడు. ఏ విషయము చెప్పాలన్నా గాని ఫ్రాంకుగ చెప్పేవాడు. అతని గొప్పగుణాల్లో అది ఒక లక్షణము!

రవిని పెళ్ళి చేసికోడం నిజంగా నా అదృష్టం అనుకోవాల్సిందే. శుభలేఖలు ప్రింటుకు పోయాయ్. ఇంటిలో అందరికీ చేతినిండా పనులే. వివాహము యింకా ఐదారు రోజులున్నయ్.

శుభలేఖ పంపకముందు వ్రాస్తున్న యీ లేఖను చూసి ఉపోద్ఘాత మనుకుంటున్నావేమో. ఈ ఉపోద్ఘాతము కనీసము నాప్రియమైన రాణికి తెలియకుంటే, నామనస్సు నన్ను బాధపెడుతుంది. మరొకళ్ళకైతే యిదంతా వ్రాయకపోదునేమో!

నా పెళ్ళికి నీవు తప్పకుండ రావాలిసుమా! హృదయం ఆహ్లాదకరంగ వుంది. ఎందుకో...?

ఇట్లు,
నీ ప్రియస్నేహితురాలు
ప్రమీల.

మీరారాణి ప్రమీల వుత్తరం చదివింది. ఆమె కనుకొలంకులపై కన్నీటితెరలు క్రమ్మాయి. బుగ్గలపై చారికలు యేర్పడ్డాయి.

మరొకసారి వుత్తరం చదువడం ప్రారంభించింది. సగమువరకు చదివి, యింక చదువలేక హృదయభారముతో క్రుంగిపోయింది. ఉత్తరములోని ప్రతి అక్షరము తనను వెక్కిరిస్తున్నయ్. అందులోని మాటలు శూలాలై తన హృదయాన్ని గాయపరుస్తున్నాయ్. బాధతో మీరారాణి మనసు వికలమై పోయింది.

మీరారాణి ఆ పదునుతనాన్ని పటాపంచలు చేసింది. జీవితపు విలువలు తెలియక, క్షణికానందం కోసం తన వయసును, యవ్వనాన్ని విచ్ఛిన్నం చేసుకుంది. ప్రియులను బానిసలుగ చేసికున్నా, సంఘంలోని నారీలోకం ముందు నిర్భయంగ నిలబడేందుకు ఏముఖంతో నిలబడుతుంది? రసికుల వెచ్చటి కౌగిటిలో స్వర్గానందాన్ని అనుభవించేంతవరకు, తనకు బయటి ప్రపంచంతో పనిలేదనుకుంది. మీరారాణి తాత్కాలికానందానికి బానిసగా తయారైంది.

చేతులు కాల్చుకుంది. కాల్చుకున్న తర్వాత దుఃఖిస్తే వచ్చేదేమీలేదు. ఒకవేళ కాల్పుఫలితము పుండు మాయమయినా, మచ్చలు మాయంకావు. ముసుగులేని యీ సత్యాన్ని మరచిపోయింది మీరారాణి.

జీవిత లోతుపాతులను చవిచూడాలని కాలాన్ని ముందునపెట్టి, ఆత్మాభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని కాలదన్ని పశుకామునికి లొంగి మానాభిమానాల్ని మంటగలుపుకుంటారు. నలుగురిలో తలెత్తకుండ తిరుగుతు, కుమిలి కృశించిపోతారు, బ్రతుకుతూ చస్తున్న బాధను అనుభవిస్తారు. తప్పటడుగు పర్యవసాన మిదిగదాయని స్మృతిపథంలో మెదలగ కన్నీళ్ళు కారుస్తారు. జీవితపరమార్థము తెలియకుండ, వాని నైతికవిలువల్ని విస్మరించి మాయని మచ్చలను ఆహ్వానిస్తే కలకాలం జీవితం దుర్భరమైపోతుంది. బాధామయ జీవితాన్ని అనుభవించాలి.

అందుకే ప్రమీల వ్రాసినవుత్తరం మీరారాణి

హృదయాన్ని గాయపరచింది. బంగారంలాంటి మీరా జీవితాన్ని పాడుచేసుకుంది.

"ప్రమీల పెండ్లికి తను ఏవిధంగ, ఏముఖంతో వెళ్ళేది? పాపిష్టి యీశరీరాన్ని అక్కడికి మోసుక వెళ్ళడం ఎందుకు? అక్కడుండేవాళ్ళు తనను ఏ విధంగా చూస్తారో! ఎలా పలకరిస్తారో!" యీ సమస్యలతో సతమతమౌతూ పోగూడదనే నిశ్చయానికి వచ్చింది.

పెండ్లిముచ్చటను చూసి ఆనందించేభాగ్యం లభించినా, సద్వినియోగ పరచుకో లేకపోయింది. దివ్యముగ జరిగే వైభవాన్ని కళ్ళారచూసి సంతోషించే అవకాశాన్ని జారవిడుచుకుంది మీరా. అంతకంటే ముఖ్యమైనదీ – తన స్నేహితురాలు ప్రమీలను ఆ పెండ్లి ముచ్చటల్లో చూడలేకపోయింది.

కాలచక్రములో రోజులు, నెలలు దొర్లిపోయాయ్.

పోస్టుమాన్ పిలుపుతో కమ్మని సంసారాన్ని సాగిస్తున్న ప్రమీల గుమ్మందగ్గిరికి వెళ్ళి కవరును అందుకొంది. ఎవరివద్దనుండి వచ్చిందో వూహించుకోలేని ప్రమీల కొంచెం ఆశ్చర్యంతోనె కవరుచింపి, ఉత్తరం మడతలను విప్పింది.

గవర్నమెంటు ఆస్పత్రి,
అమలాపురం.

ప్రియమైన ప్రమీల,

మీరిద్దరూ చిలుకాగోరింకల్లా కడుపాలని దీవిస్తూ మీరారాణి వ్రాసిన వుత్తరం.

నీ పెళ్ళికి రానందుకు చాల విచారించాను. నన్ను క్షమించేది.

నేను హాస్పిటల్లో చేరి మూడురోజులైంది. ఈ రోజు ఆపరేషన్. ఆపరేషన్ జరిగే ఒకగంటముందే యీ వుత్తరం వ్రాస్తున్నాను. కడుపులో బల్ల కావడంవల్ల నా పరిస్థితి చాల సీరియస్‌గ వుంది. నీవు కంగారుపడవద్దు.

పాపాలకు ప్రతిఫలంగా నా ఖర్మను నేను అనుభవిస్తున్నాను. దీనినుండి నన్నెవరు తప్పించలేరు.

ఈ విశాలప్రపంచంలో నాకుండే విలువ యెప్పుడో కోల్పోయాను. నేను నీకు స్నేహితురాలిగ వుండి యింత ఘనమైన సిగ్గుచేటుగల సర్టిఫికేటును గడించినందుకు నన్ను క్షమించేది.

జీవిత విలువను తెలిసికోలేకపోయాను.

ఇట్లు,
నీ అభాగ్యురాలు,
మీరారాణి.

ప్రమీల కనుగుడ్లలో నీళ్ళునిండాయి.

పాతురిడుగారి
# బాలసంజీవిని (Regd)
పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును
## డాక్టరు పిళ్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,
19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354
కుంభకోణము బ్రాంచి : 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.
అన్ని మందుల షాపులలోను దొరకును.